

దేశానికే తలమానికం సెంటర్ అఫ్ ఎక్సలెన్స్

కుప్పం హార్టికల్చర్ హబ్

- 2024 స్కోచ్ అవార్డు



విదేశీ ప్రతినిధులకు హార్టికల్చర్ హబ్‌లో వ్యవసాయ పద్ధతులు తెలియజేస్తున్న జిల్లా ఉద్యానవనశాఖ అధికారి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లా కుప్పంలో ఉన్న ప్రముఖ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఇజ్రాయెల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారు. కుప్పం నియోజకవర్గం ఉద్యానవనానికి అనుకూలమైన వాతావరణాన్ని కలిగి ఉంది. ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయడం ద్వారా కుప్పం మోడల్ టౌన్‌గా పేరు తెచ్చుకుంది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ కుప్పం ఇండో ఇజ్రాయిల్ అగ్రికల్చరల్ ప్రాజెక్టు పూలు, కూరగాయల సాగు కోసం పెద్ద బంగారునత్తం, కుప్పం మండలంలో 2019 జనవరి 2వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ద్వారా ప్రారంభించబడింది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మొత్తం 22.8 ఎకరాల స్థలంలో స్థాపించబడింది. ఇందులో 10ఎకరాల ఆపరేషన్ ప్రాంతం, 667 మీటర్ల ఎంఎస్ఎల్‌తో ఉంది. ఇక్కడ పాలీ హౌసులు 19, ఫారం పాండు, నీటి నిల్వ ట్యాంకులు 2, కోల్డ్ రూమ్ విషింగ్, గ్రేడింగ్ యంత్రాలున్నాయి.

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో చేపడుతున్న పనులు..

అన్ని రకాల కూరగాయల పంటలకు చెందిన హైబ్రిడ్ వంగడాల నారును పెంచి రైతులకు అందించడం, వివిధ రకాల కూరగాయల పంటలకు చెందిన మేలైన రకం మొక్కలను అంటుకట్టి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ కుప్పం మండలంలోని 11 మంది రైతులతో కలిపి హైబ్రిడ్ బంతి విత్తనాలను ఉత్పత్తి, వివిధ పంటలలో మేలైన కొత్త వంగడం పద్ధతులను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసి రైతులకు అవగాహన, వివిధ అంశాలపై, వివిధ పంటలపై ఆధునిక పద్ధతులపై రైతులకు, అధికారులకు, కళాశాల విద్యార్థులకు శిక్షణా తరగతులు నిర్వహించడం,

హార్టికల్చర్ హబ్ ప్రత్యేకతలు..

డ్రిప్ ఇరిగేషన్, పాలిహౌస్‌లు, సస్యరక్షణ మొదలైన ఆధునిక పద్ధతులను ఉపయోగించి వ్యవసాయాన్ని మరింత సమర్థవంతంగా చేస్తుంది. ఈ హబ్‌లోని సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రైతులు తక్కువ నీటితో ఎక్కువ దిగుబడిని పొందవచ్చు. కూరగాయలు, పండ్లు, పుష్పాలు వంటి వివిధ రకాల పంటలను సాగు చేయడానికి అనువైన వాతావరణం కలిగి ఉంది. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శిక్షణ ఇచ్చి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుంది.

ఇప్పటివరకు చేపట్టినవి..

అధిక దిగుబడి, వ్యాధి నిరోధక గ్రాఫ్టెడ్ కూరగాయల మొక్కల ఉత్పత్తి,అధిక విలువ మరియు కొత్త కూరగాయల జాతులు/కొత్త సంభాషణలు పరిచయం, కూరగాయలు, వంకాయ సోయా బీన్స్, గుమ్మడి కాయలు, ఒరియెంటల్ మస్క్‌మెలన్, గోల్డెన్ టమాట, రెడ్ క్యాబేజీ, బీరకాయ, బెండకాయలు, స్వరకాయలు, క్యాప్సికమ్, పువ్వు పంటలు, చామంతి, మెరిగోల్డ్, కొత్త పంట వ్యవస్థలను పరిచయం, గార్డులు నిలువుగా పెంచడం కోసం స్టేకింగ్ నెట్‌ను ఉపయోగించడం, సంవత్సరం నిండా పంటల ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు, మార్కెట్ డిమాండ్ కలిగిన బై బ్యాక్ మద్దతు ఉన్న కొత్త జాతుల ట్రయల్స్, ప్రారంభ ప్రదర్శనలు, రైతుల ప్రయోజనాల కోసం పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య విధానం, రైతుల ఉత్పత్తి సంస్థలను బలోపేతం చేయడం, ఒప్పంద వ్యవసాయం, కుప్పం చుట్టూ కూరగాయల, పువ్వుల క్లస్టర్ల అభివృద్ధి.

2024 స్కోచ్ అవార్డు

స్కోచ్ అవార్డు దేశంలోని వివిధ రంగాల్లో అద్భుతమైన ప్రదర్శన చేసిన సంస్థలు, వ్యక్తులను గుర్తించే ఒక ప్రతిష్టాత్మకమైన అవార్డు. కుప్పం హార్టికల్చర్ హబ్ తన అద్భుతమైన పనితీరుకు స్కోచ్ అవార్డును అందు కోవడం చాలా గర్వకారకమైన విషయం. ఈ అవార్డు కుప్పం హబ్‌లో చేపట్టిన ప్రయత్నాలకు ఒక గొప్ప గుర్తింపు. ఢిల్లీలో 2024 నవంబర్ 30న స్కోచ్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో కుప్పం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వారికి స్కోచ్ పురస్కారాన్ని అందజేశారు. దేశంలో 57 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు ఉండగా కుప్పంకు ఈ పురస్కారం రావడం గర్వకారణం. ఈ కేంద్రంలో ఇప్పటివరకు 50లక్షలు పైగా అంటుకట్టిన నార్లను రైతులకు రాయితీతో అందించారు. ఈ కేంద్రంలో ఇప్పటివరకు 43 శిక్షణా కేంద్రం నిర్వహించారు. 2,605 రైతులు 189 మంది అధికారులు పాల్గొనడం జరిగింది. సుమారు 6వేల మంది దాకా రైతులు అధికారులు, విద్యార్థులు ఈ హార్టికల్చర్ హబ్‌ను సందర్శించారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సహం

రాష్ట్రంలో ఉద్యాన రైతులకు అధిక లాభాలను తెచ్చిపెట్టేలా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు శ్రీకారం చూట్టారని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉద్యాన పంటల సాగుతో రైతులు లాభాల బాటలో పయనింపచేసేలా చేసేందుకు అవసరమైన శిక్షణా తరగతులను రైతులకు నిర్వహించి మరింత ప్రయోజనం కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.





హార్టీకల్చర్ హబ్‌లో వంగతోట, 2024 స్కోచ్ అవార్డు అందుకుంటున్న కుప్పం హార్టికల్చర్ నిర్వహణాధికారి.

పోలీస్ శాఖ పని తీరు భేష్..!

- జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పోలీస్‌శాఖ పనితీరు భేష్‌గా ఉందని గత ఏడాదితో పోల్చితే చిత్తూరు జిల్లాలో క్రైమ్ రేటు తగ్గడంతో పాటు నేరాలు అదుపు చేయడం జరిగిందని జిల్లా ఎస్పి మణికంఠ చందోలు తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో గతేడాది పోలీస్‌శాఖ నిర్వహించిన కార్యక్రమాలను వివరిస్తూ హత్యలు, కిడ్నిపింగ్, రేఫ్, సైబర్ నేరాలతో పాటు చట్టవ్యతిరేక కార్యక్రమాలు 2023లో 3,442 చోటు చేసుకుంటే 2024లో ఆ సంఖ్య 1,394కు తగ్గిందని తెలిపారు. చిత్తూరు పోలీస్ పనితీరుకు తార్కాణంగా ఎబిసిడి అవార్డును దక్కించుకోవడం జరిగిందని, జిల్లా అంతటా 'స్మార్ట్ అలారం ప్యాడ్ లాక్స్' పంపిణీ చేసి ఇంటి దొంగతనాల నివారణకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఇప్పటివరకు సుమారు 10వేల లాక్స్ పంపిణీ, మహిళా పోలీసులతో తరచు అవగాహనా సదస్సులు నిర్వహించి మహిళలు, విద్యార్థినులను చట్టపరంగా చైతన్య పరచడమైనది. సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికలను జిల్లా నందు ఎంతో శాంతియుతంగా నిర్వహించి ఎటువంటి అల్లర్లు జరగకుండా ప్రజల ఆస్తులకు ఎటువంటి నష్టం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఓటింగ్, కౌంటింగ్ ప్రక్రియ జరపడం, ఈ సంవత్సరం 4కోట్ల 46 లక్షల విలువైన 2085 మొబైల్‌ఫోన్లను రికవరీ చేసి బాదితులకు అందించడం జరిగిందని, మద్యం తాగి వాహనాలు నడిపిన 651 మంది పట్టుబడగా వారికి ఒక్కొక్కరికి 10 వేలు చొప్పున 65.1 లక్షల రూపాయలు జరిమానా, కుటుంబాల కోసం ప్రత్యేకంగా ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా చిత్తూరు జిల్లాను నిఘా నేత్రంగా తీర్చిదిద్దడానికి, ప్రజల భాగస్వామ్యంతో జిల్లా వ్యాప్తంగా 1500 కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. మొగిలి ఘాట్ నందు రోడ్డు ప్రమాదాలు నివారించడానికి చిత్తూరు పోలీసు వారి ఇంటర్సెప్టర్ వాహనం ఏర్పాటు చేయడం జరిగిదని, నెంబర్ ప్లేట్లు, సరైన పత్రాలు లేని వాహనాలను గుర్తించడానికి నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 975 వాహనాలను గుర్తించి రూ.1,54,660లు ఫైన్ విధించామని అన్నారు. చిత్తూరు జిల్లా పోలీసు వ్యవస్థ ప్రజల ధన, మాన, ప్రాణాలను, శాంతి భద్రతలను, ప్రభుత్వ ఆస్తులను కాపాడడంలో ఎల్లవేళలా, నిరంతరం శ్రమిస్తూ నేరాలను అరికట్టుటలో, నిరోధించడంలో తనదైన పంథాలో పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందింది. చిత్తూరు జిల్లా పోలీసు వ్యవస్థ సాంకేతిక పరంగా అందుబాటులో వున్న పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ప్రజల రక్షణకు మరియు సేవకు మరింత చేరువవ్వుటకు సన్నద్ధమవుతున్నట్లు తెలిపారు. విజిబుల్ పోలీసింగ్ పెంచే విధంగా, ప్రత్యేక కార్యాచరణలు చేపట్టి జిల్లావ్యాప్తంగా వివిధ అంశాలపై ఎన్ఫోర్స్మెంట్‌ను అమలు చేస్తున్నట్లు చెప్పారు.

31న సామాజిక పింఛన్లు పంపిణీ

జిల్లాలో 2,67,240 మందికి రూ. 113.49కోట్లు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జనవరి 1వ తేదీ నూతన ఆంగ్ల సంవత్సరం తొలిరోజు కావడంతో ఒక రోజు ముందుగానే ఎన్‌టిఆర్ భరోసా ఫించన్లు రాష్ట్ర ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు డిసెంబర్ 31వ తేదీ మంగళవారం ఉదయం 6 గంటల నుంచి పెన్షన్ పంపిణీ చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీలో భాగంగా చిత్తూరు జిల్లాలో జనవరి నెలలో 2,67,240 మంది పింఛనుదారులకు 113.49 కోట్ల రూపాయిలు పంపిణీ చేయవలసి ఉండగా 31వ తేదీన వందశాతం ఫించన్లు పంపిణీ చేయాలని అందుకు అనుగుణంగా అధికారులందరూ చర్యలు తీసుకోవాలన్నారు. ఫించన్ పంపిణీదారులకు మొదటి 4 గంటలలోపు పంపిణీ పూర్తిచేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ఎక్కడైనా ఏ ఒక్క పొరపాటు జరగకుండా ఫించన్లు పంపిణీ జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గత రెండు నెలలలో వివిధ కారణాలతో ఫించన్ తీసుకొని వారికి ఈనెలలో 3 నెలలు మొత్తం ఫించన్ పంపిణీ చేయబడునని తెలిపారు. ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్‌లు పకడ్బందీగా పింఛన్ల పంపిణీ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంను సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని నూతన సమావేశపు మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. దీనితో పాటు నియోజకవర్గ, మండల స్థాయిలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో నియోజక వర్గ, మండలస్థాయి అధికారులందరూ విధిగా హాజరుకావాలన్నారు.

ముగిసిన బాస్కెట్ బాల్ పోటీలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: బెంగుళూరు బైపాస్ మోర్థానపల్లి వద్ద ఉన్న పీఈఎస్ పబ్లిక్ పాఠశాలలో రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు చాలా ఘనంగా ముగిసాయి. ఈనెల 28, 29వ తేదీలలో మొత్తం వివిధ ప్రాంతాల నుంచి 33 పాఠశాలల విద్యార్థి జట్లు పాల్గొనగా, అందులో 29వ తేదీ చివరి రోజున బాలుర విభాగంలో ఫైనల్లో చిత్తూరు (పీఈఎస్ పబ్లిక్ పాఠశాల), గుడివాడ (మాంటిస్సోరి పాఠశాల) జట్లు తలపడగా గుడివాడ (మాంటిస్సోరి పాఠశాల) జట్టు విద్యార్థులు విన్నర్స్‌గా, చిత్తూరు (పిఈఎస్ పబ్లిక్ పాఠశాల) జట్టు విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. చిత్తూరు (పిసిఆర్) జట్టు విద్యార్థులు మూడవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. బాలికల విభాగంలో ఫైనల్లో చిత్తూరు (బంగారుపాలెం), అనంతపూర్ (ధర్మవరం) జట్టు విద్యార్థులు తలపడగా బంగారుపాలెం జట్టు విద్యార్థులు విన్నర్స్‌గా నిలవగా ధర్మవరం జట్టు విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. చిత్తూరు (పీఈఎస్ పబ్లిక్ పాఠశాల) జట్టు విద్యార్థులు మూడవస్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.చెంగలరాయ నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. బాస్కెట్ బాల్ కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలలో అభివృద్ధిని సాధించాలని, ఆటలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని తెలిపారు. పిఈఎస్ విద్యాసంస్థల డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థి ఏ చదువు చదివినా ఉదయం, సాయంత్రం క్రీడల మీద శ్రద్ధపెట్టాలని, ఆటల వల్ల చదువులో ఏకాగ్రతను చూపించగలరని ప్రసంగించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కుమారస్వామి నాయుడు, పిఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వైవి.కృష్ణబాబు, పిఈఎస్ పీఈటీలు అరవింద్, శశి కుమార్, రెఫరీలు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి బాస్కాల్‌బాల్ పోటీల్లో రన్నర్స్‌గా పిఈఎస్ స్కూల్ విద్యార్థులు

గుంతల రోడ్లను పట్టించుకోరా..!





సంభ్రం బస్టాప్ వద్ద కంకర్ల తేలిన తారు రోడ్డు, తూగుండ్రం పాల డైరీ వద్ద గుంతలమయంగా మారిన రోడ్డు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: ఆర్ అండ్ బి అధికారులారా.. అధ్వానపు రోడ్లను గురించి పట్టించుకోరా.. అంటూ మండల ప్రజలు, వాహనదారులు ధ్వజమెత్తున్నారు. మండలంలోని గంగాధరనెల్లూరు నుండి ముసలయ్యగారిపల్లె వరకు తారు రోడ్డు పలుచోట్ల గుంతలమయంగా మారింది. దీంతో ప్రధానంగా ద్విచక్ర, అంబులెన్స్, స్కూల్ బస్సులు కార్లు వంటి వాహనదారులకు రాకపోకలు సాగించేందుకు నానాయాతనలు పడుతున్నారు. అదేవిధంగా తూగుండ్రం పాల డైరీ సమీపంలో నుంచి పిల్లారి కుప్పం రోడ్డు వరకు, తమిళనాడు బార్డర్ దొడ్డిపల్లె మాదిగ వాడ నుంచి కొత్త వెంకటాపురం మీదుగా అగ్రహారం బస్‌స్టాప్ దగ్గర వరకు రోడ్డు గుంతలు గుంతలుగా మారింది. దళవాయిపల్లి బస్టాప్ నుండి కుమ్మరపల్లి మలుపు వరకు రోడ్డు ధ్వంసం అయింది. మేనాటంపల్లె నుంచి ఒగ్గువారిపల్లి మీదుగా కాళేపల్లి దళితవాడు వరకు రోడ్డు పాడైంది. మంగినాయనికుప్పం బస్టాప్ నుండి చెరుకట్ట మీదుగా ఎండి మంగళం మీదుగా కడపగుంట సమీపంలో వరకు రోడ్డు గుంతలమయంగా తయారైంది. మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి మండల కేంద్రంలోకి ప్రజలు, చిత్తూరు నుంచి వివిధశాఖల అధికారులు, ఉద్యోగులు గంగాధరనెల్లూరు, పాలసముద్రం మండలాలకు వెళ్ళాలంటే వారి అవస్థలు అంతా ఇంతా కాదు. చిత్తూరు -తచ్చూరు హైవే రోడ్డు నిర్మాణం వల్ల అందుకోసం మెటీరియల్ భారీ లగేజీ లారీల్లో తీసుకుని వెళ్ళడం వల్ల రోడ్లు గుంతలు ఏర్పడి ధ్వంసమై వాహనాల రాకపోకలకు నిత్యం తంటాలు పడుతూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికే చాలా మంది ద్విచక్ర వాహనదారులు గుంతల రోడ్లల్లో అదుపు తప్పి ప్రమాదాలకు గురై గాయాలతో ఆసుపత్రి పాలైన సంఘటన జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్లను బాగుచేసి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



దొడ్డిపల్లి ఆది ఆంధ్రవాడ వద్ద

ముగిసిన బాలోత్సవం

ప్రతిభావంతులకు ప్రోత్సాహాలు అందజేత





ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతి బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పిల్లల పండగ ఆదివారం అట్టహాసంగా ముసిసింది. తిరుపతి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో శనివారం ప్రారంభమైన పిల్లల పండగ, ఆదివారం కూడా కొనసాగింది. చివరి రోజు శాస్త్రీయ నృత్యాలు, కోలాటాలు, జానపద నృత్యాలు, దేశభక్తి గీతాల ఆలాపనలు తదితర పోటీలు నిర్వహించారు. అన్ని అంశాలలో సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్ మూడు విభాగాలుగా పోటీలు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం జరిగిన మట్టి బొమ్మల తయారీ పోటీలలో విద్యార్థులు మరింత ఉత్సాహంగా పాల్గొని, పలు రకాల బొమ్మలను ఉత్సాహంగా తయారు చేశారు. రెండు రోజులపాటు ఆరు వేదికల ద్వారా 30 అంశాలతో 70 విభాగాలలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన ప్రతిభావంతులకు, ముఖ్యఅతిథులు చేతిమీదుగా ప్రశంసాపత్రాలు, శీల్డులు అందజేశారు. ముగింపు కార్యక్రమం సందర్భంగా సమావేశానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన రోటరీ క్లబ్ సభ్యులు కెవి.చలపతి మాట్లాడుతూ విద్యార్థులు బలమైన కోరికలను ఎంచుకోవాలి, ఆ దిశగా ప్రణాళిక బద్ధకంగా ముందుకు వెళ్లాలన్నారు. నిరంతరం కృషి చేస్తే ఎలాంటి సమస్యనైనా అధికమించవచ్చునని తెలిపారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ బాలోత్సవం కార్యక్రమం మంచి ఉత్సాహం అందించిందన్నారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రతి నిమిషాన్ని తమకు అనుకూలమైన విధంగా మలుచుకొని, లక్ష్యాన్ని చేరుకోవాలని పిలుపునిచ్చారు. మానవ హక్కుల నాయకురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ బాలోత్సవాన్ని చూస్తుంటే తన చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తొస్తున్నాయని, ప్రతి విద్యార్థి స్కిల్‌ను పెంపొందించుకొని, కొత్త ఆలోచనలతో ముందుకెళితే లక్ష్యాన్ని చేరుకోవచ్చు అన్నారు. ఓటమికి కుంగిపోకుండా గుణపాఠంగా మలుచుకుని విజయం వైపు పైనుంచి కోరారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు మల్లారపు నాగర్జున, గౌరవ అధ్యక్షులు టెంకాయల దామోదరం, అధ్యక్షులు నడ్డి నారాయణ, కార్యదర్శి పయ్యావుల గురునాథం, సభ్యులు నెల్లూరు ముని లక్ష్మి, మోహన్ మూర్తి, ఇతర నాయకులు కమిటీ మెంబర్లు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఇలాంటి పోటీలు మాలాంటి వారికి అవసరం

- ధనుషా, 10వ తరగతి, తిరుపతి.



నా చిన్నతనం నుంచి నాకు ఆటలు పాటలు చాలా ఇష్టం. ఈ చిన్ని మ్యూజిక్ వినిపించిన గెంతులు వేసేదాన్ని. ఒకపక్క చదువుకుంటేనే మరోపక్క డ్యాన్స్ పై దృష్టి పెట్టాను. తల్లిదండ్రులు, అన్నా అక్కవాళ్ళు ప్రోత్సహించారు. అప్పుడప్పుడు పలు ప్రదర్శనలో నా డ్యాన్సును ప్రదర్శించేదాన్ని. ఈ బాలోత్సవం వేదిక ద్వారా మరోసారి నా డ్యాన్సర్ ప్రదర్శించే అవకాశం వచ్చింది. ఇందుకు నిర్వాహకులకు కృతజ్ఞతలు.

బొమ్మల గీయడం ఆశ

- సూర్య, ఏడవ తరగతి విద్యార్థి, తిరుపతి.



చిన్నప్పటినుంచి బొమ్మలంటే చాలా ఆశ. అందుకే బొమ్మలు గీయడం నేర్చుకోవాలని అనుకున్నాను. అప్పుడప్పుడు చిన్న చిన్న బొమ్మలు గీసే వాడిని. టీచర్ల ప్రోత్సాహంతో పలు సీనరీలు గీయటం ప్రారంభించాను. నా సామర్థ్యాన్ని పరీక్షించుకుందాం అని ఈ పోటీలలో పాల్గొంటున్నాను. ఇలాంటి పోటీలు ఎంతో అవసరం.

దేశ సేవ చేయాలనుంది

- ధరణి, 9వ తరగతి, తిరుపతి.



నాకు చిన్నప్పటి నుంచి దేశ సేవ చేయాలని ఆశ. నాతోటి పిల్లలు చాలామంది డ్యాన్సులు, క్రీడలు, ఆట పోటీలలో పాల్గొనేందుకు ఆసక్తి చూపేవారు. కానీ నాకు దేశ రక్షణ విభాగంలో పనిచేయాలని ఉంది. అందులో భాగంగానే మా తల్లిదండ్రులను ఒప్పించి ఎన్సిసిలో చేరాను. ఇలాంటి కార్యక్రమంలో భద్రతకు సంబంధించిన పనులు చేస్తుండడం సంతోషంగా ఉంది.



బాలోత్సవాన్ని సందర్శించిన పి. మధు

మాజీ రాజ్యసభ సభ్యులు, సిపిఎం సీనియర్ నాయకులు పి. మధు బాలోత్సవాలను సందర్శించారు. టీటీడీ పరిపాలన భవనం వద్ద టీటీడీ శ్రీవారి మెట్టు వ్యాపారులు చేస్తున్న దీక్షలకు మద్దతు తెలిపిన ఆయన, అక్కడి నుంచి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానానికి చేరుకొని బాలోత్సవం కార్యక్రమంలో విద్యార్థులు చేస్తున్న ప్రదర్శనను తిలకించారు. వేలాదిమంది విద్యార్థులకు తమ ప్రతిభ పాటవాలు చాటేందుకు, అంత పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్న బాలోత్సవ కమిటీని ఆయన అభినందించారు. ఆయన వెంట సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి పాల్గొన్నారు.

యుటిఎఫ్ ప్రచార యాత్ర



చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని కోరుతున్న యుటిఎఫ్ నాయకులు





ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్, పెద్దపంజాణి: యుటిఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం యుటిఎఫ్ నాయకత్వం పుంగనూరు, పలమనేరు, బంగారుపాళ్యంలో ప్రచార యాత్రను నిర్వహించారు. ముందుగా యుటిఎఫ్ పతాకాన్ని సీనియర్ నాయకులు ఎం.సురేష్ బాబు ఆవిష్కరించడం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ యుటిఎఫ్ సంఘాన్ని ఏర్పాటు చేసి 50 సంవత్సరాలు పూర్తి అయిన నేపథ్యంలో రాష్ట్రస్థాయి స్వర్ణోత్సవ సంబరాలను జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు కాకినాడలో జరుగుతున్న ఈ మహాసభలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దేశవ్యాప్తంగా విద్యావేత్తలు ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడం నిమిత్తం విద్యావేత్తలు నిర్ణయించనున్నట్లు తెలిపారు. 20,000 మంది పైచిలుకు ఉపాధ్యాయులతో నాలుగు రోజులు పాటు జరిగే ఈ స్వర్ణోత్సవ మహాసభలలో ప్రధానంగా విద్యావిధానానికి విఘాతం కలిగించే 117జీవో రద్దు, ప్రభుత్వ విద్యారంగ బలోపేతం, సిపిఎస్ రద్దు, వీటితో పాటు పలు అంశాలను చర్చించి తీర్మానం చేసే చర్య పత్రాలను విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఈ మహాసభలకు చిత్తూరు ప్రాంతం నుండి పెద్దఎత్తున ఉపాధ్యాయ మిత్రులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి మహాత్మా గాంధీజీ విగ్రహానికి పూలమాలధారణ చేయడం జరిగింది. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సోమశేఖర్ నాయుడు, ఎన్.మణిగండన్, జిల్లా నాయకులు పి.సుధాకర్ రెడ్డి, ఎస్.రెహానా బేగం, డి.ఏకాంబరం, కె.సరిత, పంటపల్లి సురేష్, ఎం.పార్థసారథి, కె.గణేష్ కుమార్, పిసి.బాబు, సి.వెంకటేశ్వర్‌రెడ్డి యాదవ్, వి.సాధన కుమార్, బిర్లా నాయుడు, డివిజన్ పరిధిలోని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.దేవరాజు నాయుడు, అరుణ్ కుమార్, నాగరాజా, రాజేష్ కుమార్, పెద్దబ్బ రెడ్డి, సర్దార్, రాజేంద్రన్, మునికృష్ణయ్య, భానుప్రకాష్, మధు, రాజేంద్ర, మోహన్‌రెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: యుటిఎఫ్ బలోపేతం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సరిత అన్నారు. ఆరు నియోజకవర్గాల్లోని ఆదివారం ప్రచార యాత్ర ప్రారంభమైంది. యుటిఎఫ్ సభల్లో ఉపాధ్యాయ సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. యుటిఎఫ్ మండలాధ్యక్షులు మహేష్ బాబు, ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, కౌన్సిలర్ నెంబర్ చెంగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

అక్రమ కలప స్వాధీనం

ప్రజాశక్తి- కుప్పంటౌన్: కుప్పం నియోజకవర్గ పరిధిలో అక్రమంగా కలప రవాణాపై అటవీ శాఖ అధికారులు నిఘా ఉంచారు. అక్రమ కలప రవాణాపై మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో భాగంగా శనివారం అర్ధరాత్రి సమయంలో అక్రమ కలప రవాణాదారులపై అటవీ శాఖ అధికారులు ఉక్కుపాదం మోపారు. నియోజకవర్గ పరిధిలోని పలుచోట్ల నుండి అక్రమంగా కలపను తరలిస్తున్న 8 ట్రాక్టర్లను అటవీశాఖ అధికారులు స్వాధీన పరుచుకున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.




అక్రమ కలపను తరలిస్తున్న ట్రాక్టర్లు

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

యువకుడికి గాయాలు

ప్రజాశక్తి- చౌడేపల్లి: స్కూటర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు గాయపడిన సంఘటన ఆదివారం చౌడేపల్లిలో చోటు చేసుకుంది. చౌడేపల్లి పుంగనూరు ప్రధాన రహదారిలో స్థానిక పెట్రోల్ బంకు వద్ద ఎల్లబంట్ల వైపు వెళ్తున్న స్కూటర్‌ను వెనుకనే వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొన్నది ఈ ప్రమాదంలో పెద్ద ఎల్లకుంటకు చెందిన సునీల్ (26)కు కాలు విరిగింది. స్థానికులు 108 ద్వారా మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వైసీపీ నాయకుడి కుటుంబానికి పరామర్శ



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలం వలస నేల్లేపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు ఆయిలురెడ్డి తండ్రి నడిపిరెడ్డి కర్మక్రియల కార్యక్రమానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఇన్చార్జి కృపాలక్ష్మి, చిత్తూరు నియోజకవర్గ ఇన్చార్జి ఎంసి విజయనంద్ రెడ్డి, సత్యవేడు నియోజకవర్గ ఇన్చార్జి నూకతోటి రాజేష్, సీనియర్ నాయకులు ఆనగంటి హరికృష్ణ పరామర్శించారు. వలస నెల్లెపల్లి గ్రామంలో నడిపిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వేల్కూరు బాబురెడ్డి, గురవారెడ్డి, చిన్నం రెడ్డి, సురేందర్ రెడ్డి, బలరామిరెడ్డి, అలీ షేక్‌ఖాన్, కుట్టి, గోవిందన్, ఎంపీటీసీ హనీఫ్ బాషా, దేవన్, సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.

మునెమ్మకు నివాళి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని పుల్లూరు దళితవాడకు చెందిన వైసిపి సీనియర్ మహిళ నాయకురాలు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడం జరిగింది. నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్చార్జి కృపాలక్ష్మి మునెమ్మ మృతికి నివాళి అర్పించి, వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆమెతోపాటు మండల అధ్యక్షులు మణి, ఎంపీపీ సరిత, జనార్ధన్, సర్పంచ్ కుమారి బాబు, ఎంపీటీసీ చంద్రశేఖర్, కాలప్ప, హరిరెడ్డి, వెంకటేష్, శోభన్ బాబు, మదన్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ప్రగతికి సోపానం

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం మండలం వెండుగంపల్లి గ్రామంలో వ్యవసాయ అధికారులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సును నిర్వహించారు. గ్రామంలోని ఉష అనే రైతు పొలంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏటీఎం మోడల్ ద్వారా ప్రధాన పంటలు పండించే విధానాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సేంద్రియ ఎరువులు వాడి, పంట దిగుబడి పెంచే పద్ధతులపై అవగాహన కల్పిస్తూ, సేంద్రియ వ్యవసాయం పండించిన వాటిని వినియోగించడం వల్ల ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. చిత్తూరు జిల్లా డిపిఎం వాసు ఆదేశాల మేరకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఏఎన్ఎం లక్ష్మీకాంత్, ఎంఎంటి విజయ్ కుమారి, కుప్పం డివిజన్ ఎన్ఎఫ్ఎం టి.నాగరాజులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

చెరువును తలపిస్తున్న రోడ్డు



చెరువును తలపిస్తున్న రోడ్డు

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం పెద్ద ఉప్పరపల్లి గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వాటిలో వర్షపు నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. సోమల నుండి నంజంపేట పెద్ద ఉప్పరపల్లి మార్గంలో అధ్వాన్నంగా తయారైన రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. గుంతలు ఉన్న ప్రాంతంలో మట్టిని తొలగించి కంకర పోసి రోడ్డు రోలర్‌తో చదును చేస్తూ వస్తున్నారు. ఆపై ప్యాచ్ వర్క్ కింద తారు రోడ్డు వేయనున్నట్లు సమాచారం. అయితే పెద్ద ఉప్పరపల్లి గ్రామం ప్రారంభం అయ్యే రోడ్డు వద్ద భారీ గోతులు ఏర్పడి వాటిలో వర్షపు నీరు నిలువ నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. రోడ్డు మరమ్మతు పనులను వేగంగా నిర్వహించి ప్యాచ్ వర్క్ పూర్తి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



కాలువలో వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం పెద్ద ఉప్పరపల్లి గ్రామంలో పంచాయతీ కార్మికులచే పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టారు. పెద్ద ఉప్పరపల్లి, నంజంపేట మార్గంలోని రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొరుగునీటి కాలువలో చెత్తాచెదారాన్ని తొలగించి కాలువల గట్టుపై ఉన్న పిచ్చి మొక్కలను 15మంది పంచాయతీ కార్మికులు ఆదివారం పారిశుధ్యం చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి మసూద మాట్లాడుతూ గ్రామంలోని అన్ని వీధులలోని మురుగు నీటి కాలువలలో మురుగును తొలగించి నీరు సజావుగా ప్రవహించేలా చేస్తున్నామని తెలిపారు.

బాబు పర్యటనకు ముందస్తు ఏర్పాట్లు

ప్రజాశక్తి- కుప్పంరూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గంలో 5, 6 తేదీలలో పర్యటిస్తున్నట్టు ఇప్పటికే టిడిపి వర్గాలు తెలిపాయి. బాబు పర్యటనపై అధికారిక ప్రకటన విడుదల కాకపోయినా అధికారులు, నాయకులు చేపడుతున్న కార్యక్రమాలు టిడిపి నాయకుల ప్రకటనకు బలం చేకూరుతోంది. గత రెండు రోజులుగా కుప్పం పట్టణం పరిధిలో బాబు పర్యటనకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో పురపాలక సంఘం అధికారులు, సిబ్బంది ఆదివారం పట్టణంలోని ఎన్టీఆర్ క్రీడాప్రాంగణంలో పారిశుద్ధ్య పనులతో పాటు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ పనులను కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్ పర్యవేక్షించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు కుప్పం పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో ఆయన కుప్పం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

తులసీనాథంకు ఘన సన్మానం



ప్రజాశక్తి- గంగవరం: భాషోద్యమ సదస్సులో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు పాల్గొని తెలుగు భాషా రక్షణకు తీసుకోవలసిన చర్యలు గూర్చి వివరించారు. రాష్ట్రంలో అన్ని యాజమాన్య పాఠశాలల్లో తెలుగులో బోధించాలని ప్రభుత్వ ఉద్యోగులకు తెలుగు చదివిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అలాగే గ్రామ సచివాలయం నుండి రాష్ట్ర సచివాలయం వరకు పరిపాలన తెలుగులోనే జరగాలని నామ పలకలన్నీ తెలుగులోనే ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు, ముక్తేశ్వరరావు, తెలుగు పరిరక్షణ సమితి నిర్వాహకులు రచయితలు ఆయనను ఘనంగా సత్కరించారు.

అన్నదానం



ప్రజాశక్తి- శాంతిపురం: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తన తండ్రి దివంగత నారాయణప్ప జ్ఞాపకార్థం ఆదివారం మండల కేంద్రంలోని అన్న క్యాంటీన్లో అన్నదాన కార్యక్రమం జరిపించారు. తన తండ్రి 5వ వర్ధంతి సందర్భంగా పేదలకు ఒక్కపూట ఆకలి తీర్చడానికి తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లో ఆదివారం పేదలకు అన్నదానం చేశారు. ఆకలితో ఉన్న నిరుపేదలకు అన్నదానం చేయడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన తెలిపారు.

ప్రభుత్వం మొద్దు నిద్రను వీడాలి

ఏపీ సమగ్ర శిక్ష రాష్ట్ర నాయకులు



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: తెలంగాణ ప్రభుత్వం మొద్దు నిద్రను విడాలని ఏపీ సమగ్ర శిక్ష రాష్ట్ర నాయకులు విల్బనాథ్ అన్నారు. ఆదివారం తెలంగాణలో జరుగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా ఆంధ్రప్రదేశ్ నుంచి చిత్తూరు జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల నాయకులు తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా హైదరాబాద్ జిల్లా సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో వద్ద జరుగుతున్న సమ్మె శిబిరాన్ని సందర్శించి ఆంధ్రప్రదేశ్ తరపున సంఘీభావాన్ని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులు కోరుతున్న న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి, సతీష్ బాబు, పార్ట్ టైం ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

దళవాయి చెరువుకట్ట వద్ద డైవర్షన్ రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి- సోమల: మండలం పొదలకుంటపల్లి నంజంపేట మార్గమధ్యంలోని దలవాయి చెరువు తూము వద్ద గండిపడి కట్ట పది అడుగుల మేర కొట్టుకుపోయిన ప్రాంతంలో ఆదివారం డైవర్షన్ రోడ్డు నిర్మాణాన్ని వేగవంతంగా చేపట్టారు. ఈనెల నాలుగవ తేదీ తూము వద్ద గండిపడి కట్ట కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. నీటి ఉధృతి తగ్గకపోవడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. నీటి ఉధృతి తగ్గగానే మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు చొరవ తీసుకొని ఇరిగేషన్ శాఖవారితో మాట్లాడి ప్రజలకు ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగించేందుకు డైవర్షన్ రోడ్డు నిర్మాణాన్ని భారీ పైపులు ఏర్పాటు చేసి దానిపై ఇసుక మూటలు పరచి రాకపోకలు సాగించేందుకు నిర్మాణాన్ని చేపట్టారు. 24 గంటల్లో నిర్మాణ పనులు పూర్తయి ప్రజలు వాహనాలు రాకపోకలు సాగించేందుకు అవకాశం కలుగుతుందని అటు తర్వాత కట్ట తెగిన ప్రాంతంలో శాశ్వత ప్రాతిపదికన నిర్మాణాన్ని చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు.



పైపులు ఏర్పాటు చేసి ఇసుక మూటలు పరిచి డైవర్షన్ రోడ్డు నిర్మిస్తున్న కార్మికులు

చిత్తూరు అభివృద్ధికి సహకరిద్దాం

చుడా ఛైర్ పర్సన్ కఠారి హేమలత

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక పెన్షన్ భవన్లో ఆదివారం చిత్తూరు స్మార్ట్ సిటీ అండ్ డెవలప్మెంట్ సొసైటీ సర్వసభ్య సమావేశం తాండవ మూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా చిత్తూరు అర్బన్ డెవలప్మెంట్ సొసైటీ ఛైర్‌పర్సన్ (చుడా) కటారి హేమలత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేను పుట్టిన ఊరిని అభివృద్ధి చేయాలనే తపన, ఆలోచన మీ సొసైటీతో పాటు తనకి కూడా ఉందని అన్నారు. ముఖ్యంగా నగర శివారులో రోడ్ల విస్తరణ శరవేగంగా జరుగుతోందని, అలాగే నగర మధ్యలో రోడ్ల విస్తరణ కొరకు స్థానిక ఎమ్మెల్యే గురజాల సలహా, సూచన మేరకు తోడ్పాటు అందిస్తానన్నారు. ఈ విషయంగా నిరంతరం ఎమ్మెల్యే అందరితో మాట్లాడుతున్నారని, భవన యజమానుల సంఘం కూడా అభివృద్ధికి సహకరించి మధ్య మార్గంగా ఎమ్మెల్యేతో మాట్లాడుకొని 100 సంవత్సరాల చరిత్ర కలిగిన జిల్లా కేంద్ర ప్రజల అవసరాల మేరకు అభివృద్ధికి ముందుకు రావాలన్నారు. సొసైటీ సభ్యులు తాండవమూర్తి, సత్య, గోపి నాయక్, అశోక్ కుమార్, చంద్రబాబు మాట్లాడుతూ కాట్పాడి, చిత్తూరు తిరుపతిల మధ్య రైల్వే డబుల్ లైన్‌ను త్వరగా పూర్తి చేయాలని, కేంద్ర విద్యాలయం, నూతన మహావీర్ బ్రిడ్జి నిర్మాణం, యూనివర్సిటీ, ప్రభుత్వ అపోలో కలయికలో ఉన్న నగర పెద్దఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీగా, ఇంకా ఇతర అన్ని సమస్యలు అభివద్ధిపై పలువురు చర్చించారు. ముఖ్యంగా మహిళలను సొసైటీలో చేర్చుకొని ఇంకా బలోపేతం చేయాలని తెలిపారు. సమావేశంలో కార్యదర్శి శివకుమార్ నాయకులు, శ్రీనివాసమూర్తి, మురళి, సింగ్, బొట్టు స్వామి, వరదరాజులు, రాజేంద్ర, శ్రీనివాస బాబు, జిల్లా పెన్షనర్ అధ్యక్షులు నాగరాజు, శరత్, గణేష్, రషీద్, రాజేంద్ర, కుమరేషన్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న చుడా ఛైర్‌పర్సన్ హేమలత

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని ముక్కలత్తూరు పాఠశాలకు చెందిన 2002- 2003 సంవత్సరంలో 10వ తరగతి విద్యను అభ్యసించిన విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళన కార్యక్రమంలో కలిశారు. చిత్తూరు నగరంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో 2002 -2003 సంవత్సరంలో తమకు విద్యను బోధించిన గురువులు పద్మనాభ పిల్లై కుప్పారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, చక్రధరావు, సునీల్ కుమార్, శాంతి, నాగలక్ష్మి, శ్రీదేవి పూర్వ విద్యార్థులు ఘనంగా పూలమాల దుస్సాలువలతో సత్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. వారు మాట్లాడుతూ తాము విద్యను అభ్యసించిన ముక్కలతూరు జడ్పీ హైస్కూల్‌లో త్వరలో సరస్వతి విగ్రహం నిర్మాణం చేపట్టి ఆవిష్కరించబోతున్నామని, అలాగే పిబి అగ్రహారానికి చెందిన విద్యార్థులు ఇబ్బందులు పడుతూ పాఠశాలకు వస్తున్నారని వారికి కూడా ఒక మంచి మార్గం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మూర్తి, లత, పవిత్ర, ప్రసాద్ బాబు, హరిత, కుమారి, సారధి, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద పాలకులు దేశానికి ప్రమాదకరం

సీపీఎం మాజీ రాజ్యసభ సభ్యులు పి మధు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: కేంద్రంలో అధికారంలో వున్న బిజెపి మతపరమైన పాలన తీసుకొస్తోందని, మతోన్మాద పాలకులు దేశానికి ప్రమాదకరమని సీపీఎం మాజీ రాజ్యసభ సభ్యులు పి మధు పేర్కొన్నారు. తిరుపతి యశోదనగర్ సీపీఎం జిల్లా కార్యాలయంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి జనార్ధన్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో మధు మాట్లాడుతూ పార్లమెంటులో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఒకే దేశం ఒకే ఎన్నిక పేరుతో జమిలి ఎన్నికలను ముందుకు తీసుకొస్తోందని విమర్శించారు. దేశ ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. బీజేపీ అనుసరిస్తున్న విధానాలపై కూటమి పార్టీ నేతలు స్పందించకపోవడం అన్యాయమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై ప్రజా ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మతోన్మాద శక్తుల ఆట కట్టించాలి..

తిరుపతి టౌన్, తిరుపతి సిటీ: తిరుపతి నగరంలో గత కొన్నాళ్లుగా సాగుతున్న మతోన్మాద శక్తుల ఆగడాలను అరికట్టాలని సిపిఎం మాజీ రాజ్యసభ సభ్యులు, అగ్రనేత పెనుమల్లి మధు అన్నారు. రాష్ట్రంలో దళితులు, ఆదివాసీలపై మతోన్మాద శక్తుల దాడులను ఖండిస్తూ రాష్ట్రస్థాయి సదస్సు తిరుపతి అంబేద్కర్ భవన్‌లో జరిగిన రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ పూతలపట్టు అంజయ్య అధ్యక్షత ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథి పెనుమల్లి మధు మాట్లా డుతూ దేశంలో, రాష్ట్రంలో బిజెపి ఆగడాలు మితిమీరిపోతున్నాయని బిజెపి అనుయాయ శక్తులుగా ఉన్న వీహెచ్‌పి, ఆర్ఎస్ఎస్ లాంటి మతోన్మాద శక్తులు తిరుపతిని కేంద్రంగా చేసుకొని దేశంలో ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి కారణ మవుతు న్నాయని గుర్తు చేశారు. మతోన్మాద శక్తుల ఆగడాలు పెరగడానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యవహరిస్తున్న తీరు కూడా ఓ కారణమన్నారు. బిజెపి రాష్ట్రంలో జనసేన, టిడిపిలకు ఉరితాడుగా పరిణమిస్తోందన్నారు. మతోన్మాద శక్తులను నియంత్రించకపోతే ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న ఆంధ్ర రాష్ట్రానికి అరిష్టమని మధు అన్నారు. టిటిడిలో నిత్యం ఏదో ఒక అంశం ఆధారంగా ఘర్షణలు సృష్టించడానికి బిజెపి అనుయాయిలు చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ పరిపాలనలో టీటీడీలో జరిగిన తప్పుడు పనులపై బిజెపి మాట్లాడుతోందని సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి బోర్డులలో బిజెపి ఎమ్మెల్యేలు, కార్యకర్తలు ఎనిమిది మందికి పైగా ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. వైసీపీ చేసిన పాపాలలో బిజెపి పాత్ర వుందని, 'దొంగే... దొంగ దొంగ అన్నట్టుగా బిజెపి నేతలు టీటీడీలోని ప్రతి నిర్ణయంలో తమ భాగస్వామ్యం వున్నా నేడు అడ్డగోలుగా మాట్లాడుతోందని తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. మతోన్మాదుల ఆటలను ప్రజాస్వామ్య వాదులు, శాంతి కాముకులు ముందుకొచ్చి తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈశ్వరయ్య మాట్లాడుతూ తిరుపతిలో పరిణామాలు దేశంలోని పలుచోట్ల ఆందోళనలకు కారణం అవుతున్నాయని వీటిని నివారించాలన్నారు. ఈ సదస్సులో పౌర హక్కుల సంఘం రాష్ట్ర నేత క్రాంతి చైతన్య, సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, సిపిఎం జిల్లా కార్యదర్శి వి. నాగరాజు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, కాళయ్య, గోపి, మాంగాటి గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో తిరుపతి నగర ప్రజలు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జల క్రీడల కేంద్రంగా రాయల చెరువు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -రామచంద్రాపురం: రాయలచెరువును జల క్రీడల కేంద్రంగా తీర్చుదిద్దుతామని, యువతను, క్రీడా కారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ ధ్యేయమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) అన్నారు. రామచంద్రాపురం మండలం రాయల చెరువులో జాతీయ స్థాయి డ్రాగన్ బోటింగ్ పోటీలకు ఎంపికై శిక్షణలో వున్న రాష్ట్ర జట్టు క్రీడాకారుల పరిచయ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శిక్షణను ప్రారంభించారు. రాయలచెరువు కట్ట వద్దకు చేరుకున్న ఎమ్మెల్యేకి స్థానిక నాయకులతో కలిసి అధికారులు, అసోసి యేషన్ ఛైర్మన్ ప్రదీప్ నాయుడు, నాయకులు, అధికారులు అపూర్వ స్వాగతం పలికారు. క్రీడా కారులను పరిచయం చేసుకుని,క్రీడా దుస్తులను, కిట్లను పంపిణీ చేశారు. అనంతరం డ్రాగన్ బోటింగ్ లో ఉపయోగించే పరికరాల గురించి, నీటిలో ప్రమాదం జరిగితే తీసుకోవాల్సిన చర్యలను గురించి సి క్యాప్ అసోసియేషన్ ఛైర్మన్ ప్రదీప్ నాయుడు ఎమ్మెల్యేకు వివరించారు. రాయల చెరువుకు మండల అధికారులు, కూటమి పార్టీల నాయకులతో కలసి ప్రత్యేక, పూజలు చేసి, జల హారతి పట్టారు. రాయల చెరువులో డ్రాగన్ బోట్ లో తిరుగుతూ శిక్షణను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ గత ప్రభుత్వం



యువతను క్రీడలను నిర్వీర్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకుడు ఐటి విద్యాశాఖ మంత్రి లోకేష్ యువతను అన్ని విధాల అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే క్రీడలకు పెద్దపీట వేస్తూ నిధులు మంజూరు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోనే పెద్ద చెరువు రాయలచెరువును క్రీడా ప్రాంతంగాను, టూరిజం హబ్ గా అభివృద్ధి చేయటానికి కృషి చేస్తున్నా మన్నారు. రాయల చెరువులో అన్ని పరిస్థితు లు కలిసి వస్తే 2025 -26 సంవత్స రంలో జాతీయ స్థాయి జలక్రీడల పోటీలను నిర్వహించ డానికి కృషి చేస్తామ న్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసము కలగడమే కాకుండా శారీరక దారుఢ్యం ఏర్పడుతుందని తెలిపారు. క్రీడలలో రాణిస్తే ఉన్నత విద్యలో, ఉద్యోగాలు పొందటంలో మంచి అవకాశం కలుగుతుందన్నారు. సి క్యాప్ అసోసియేషన్ ఛైర్మన్ ప్రదీప్ నాయుడు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే నాని సహాయ సహకారాలతో, శాప్ ఛైర్మన్ రవి నాయుడు అండదండలతో రాయల చెరువులో డ్రాగన్ బోటింగ్ జాతీయ పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు శిక్షణ ఏర్పాటు చేశామని చెప్పారు. 50 మంది క్రీడా కారులకు ఐదుగురికి కోచ్ లు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం రాయల చెరువు కట్టపై డ్రాగన్ బోటింగ్ శిక్షణ ప్రారంభోత్సవానికి గుర్తింపుగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్ అహ్మద్, తహశీల్దారు వెంకటరమణ, ఎంపీడీవో ఇందిరా, వివిధ శాఖల అధికారులు, తిరుపతి పార్లమెంటరీ నాయకులు శ్రీధర్ వర్మ, మండల టిడిపి అధ్యక్షులు తిరుమలరెడ్డి, నాయకులు చేకూరి జనార్దన్ చౌదరి, కొట్టే నరసింహారెడ్డి, ఉమాపతి నాయుడు, ఆరి లీల మోహన్, కోరా హరి ప్రసాద్, పసుపులేటి విజయ్ కుమార్, మధుసూదన్ రెడ్డి, సాయి ప్రసాద్ రెడ్డి, బాదూ రు నరసింహా రెడ్డి, త్యాగరాజులు, బాదూరు ధనుంజయులు, పూజారి సుబ్రమణ్యం యాదవ్ పాల్గొన్నారు.